ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 9951775293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 74 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి గురువారం 16 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02

# దక్షిణాదికి ఎలాంటి నష్టం జరగదు

## జనాభాతో సంబంధం లేకుండా లోక్‌సభ సీట్లు 50% పెంపు!

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూటమి నేతల కీలక సమావేశం




- కేంద్ర మంత్రులకు ఫోన్.. సందేహాల నివృత్తి
- అన్ని రాష్ట్రాల్లోనూ వర్తింపు.. సీట్ల పెంపుపై స్పష్టత
- మహిళాబిల్లుపై పవన్ కల్యాణ్, పీవీఎన్ మాధవ్, పల్లా శ్రీనివాసరావులతో సమావేశం
- అసెంబ్లీ స్థానాల పెంపుపై అప్పుడే స్పష్టత
- మహిళా బిల్లుకు ఆమోదాన్ని వేడుకగా నిర్వహిద్దాం
- మహిళా బిల్లుకు మద్దతుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ
- సీఎం కార్యాలయంలో కూటమి నేతల భేటీ

**కూటమి నేతలకు స్పష్టం చేసిన కేంద్ర మంత్రులు**

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కలసి కట్టుగా మద్దతు తెలిపేందుకు రావాలని వైఎస్సార్సీపీ సహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, పల్లా శ్రీనివాసరావులు నిర్ణయించారు. ఈ నెల 17న అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి అమరావతి వేదికగా మహిళా బిల్లును ప్రత్యక్షంగా వీక్షించే ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ప్రజా ప్రతినిధులతో పాటు మహిళా ప్రముఖుల్ని ఈ వేడుకకు ఆహ్వానించాలనే ఏకాభిప్రాయానికి నేతలు వచ్చారు.

దక్షిణాదికి ఎలాంటి నష్టం జరగదు
కేంద్ర మంత్రులకు ఫోన్.. సందేహాల నివృత్తి
నారీ శక్తి వందన్ బిల్లుకు మద్దతుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ

2వ పేజీలో

# ఏపీలో నేటి నుంచే జనగణన

- తొలుత హౌస్ లిస్టింగ్ : సెన్సస్ అధికారి జె.నివాస్
- రాష్ట్రంలో నేటి నుంచే సెన్సస్ ప్రక్రియ ప్రారంభం
- కేంద్ర, రాష్ట్ర ప్రణాళికలకు సెన్సస్ ప్రామాణికమని తెలిపిన సెన్సస్ అధికారి
- జె.నివాస్ – దీనికి ప్రజలు పూర్తిగా సహకరించాలని పిలుపు



# గురువారం లోక్‌సభ ముందుకు డీలిమిటేషన్ బిల్లు

- కేంద్రం వైఖరిపై ఉత్కంఠ!
- మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు–2026 తీసుకొస్తున్న కేంద్రం
- పునర్విభజన బిల్లును సభ ముందుకు తీసుకురానున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్
- రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్య 815గానూ, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొన్న కేంద్రం
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించిన కేంద్రం



# మత్స్యకారుల పొట్ట కొడుతున్నారు: వైఎస్ జగన్

* గంగపుత్రులను తరిమేసేందుకు చంద్రబాబు సర్కారు కుట్ర
* జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తయ్యి రెండేళ్లయినా ఎందుకు అప్పగించలేదు?
* రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్లన్నీ మత్స్యకారుల హక్కు
* చంద్రబాబు కాదు కదా.. ఆయన తాత కూడా మత్స్యకారులను పంపలేరు
* నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ,మాజీ సీఎం వైఎస్ జగన్
* జువ్వలదిన్నె హార్బర్ భూములను ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టడం దుర్మార్గం
* మన ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మత్స్యకారులందరినీ పక్కాగా మ్యాపింగ్
* రూ.3,800 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లతో వారి జీవన ప్రమాణాల పెంపునకు శ్రీకారం
* రూ.150 కోట్లతో 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు
* రూ.16 వేల కోట్లతో కొత్తగా 4 పోర్టులు
* మరో రూ. 6 వేల కోట్లతో పోర్టుల విస్తరణ ప్రణాళిక సిద్ధం.. మొత్తంగా రూ.26 వేల కోట్లు
* అన్ని రకాల అనుమతులతో దాదాపు 95 శాతం ప్రాజెక్టుల పనులు పూర్తి
* మా ప్రభుత్వ హయాంలోనే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి.. వచ్చేది మా ప్రభుత్వమే.. ఈ హార్బర్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

మత్స్యకారుల కడుపు కొట్టడం కోసం నారా లోకేశ్, ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు పలువురు ఏకమవ్వడం దుర్మార్గం. ఆధారాలు కళ్ల ముందు స్పష్టంగా కనిపిస్తున్నా ఒక్కరినైనా అరెస్ట్ చేశారా? పోలీసులు సీజ్ చేసిన బంగారాన్ని ఎవరైనా పోలీస్ స్టేషన్ నుంచి దొంగతనంగా ఎత్తుకెళ్లిపోతే మీరు ఇలాగే విడిచి పెడతారా? మత్స్యకారులంటే ఇంత చులకనా? చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి. ఎల్లకాలం ఈ ప్రభుత్వం ఇలాగే కొనసాగదు. ఇంత కన్నా దిక్కుమాలిన ప్రభుత్వం ప్రపంచ చరిత్రలో ఇంకొకటి ఉంటుందా?

-- వైఎస్ జగన్




# కదిరిలో భారీ పేలుడు

* ఇంట్లో భారీ శబ్దంతో పేలిన డిటోనేటర్లు
* ఐదుగురు మృతి, 11 మంది పరిస్థితి విషమం
* సత్యసాయి జిల్లాలో ఓ ఇంట్లో భారీ శబ్దంతో పేలిన డిటోనేటర్లు
* ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా 21 మందికి తీవ్ర గాయాలు
* 11 మంది పరిస్థితి విషమం
* మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండ



# 180 మందిపై అత్యాచారం!

* 350 అశ్లీల వీడియోలు
* ప్రేమ పేరిట ట్రాప్ చేసి ఆపై అఘాయిత్యం
* వీడియోలు తీసి బ్లాక్ మెయిల్.. ఆన్‌లైన్‌లో షేర్
* మహారాష్ట్రలో 19 ఏళ్ల యువకుడి దురాగతం



# వచ్చేసింది యువరాణి

**చెన్నై స్టార్ ప్రతిష్ఠాత్మక ఫిడే క్యాండిడేట్స్ చెస్ మహిళల టైటిల్‌ను నెగ్గిన తొలి భారత మహిళగా చరిత్ర**
**వెన్‌జున్‌తో ప్రపంచ టైటిల్ పోరుకు అర్హత**
**ప్రజ్ఞానంద, దివ్యకు ఏడో స్థానం**
**ఓపెన్ విభాగం విజేత సిందరోవ్**

పఫోస్ (సైప్రస్): భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేష్ బాబు చరిత్ర సృష్టించింది. ఈ 24 ఏళ్ల చెన్నై స్టార్ ప్రతిష్ఠాత్మక ఫిడే క్యాండిడేట్స్ చెస్ మహిళల టైటిల్‌ను కైవసం చేసుకుంది. తద్వారా క్యాండిడేట్స్ టోర్నీ గెలిచిన తొలి భారత మహిళగా అరుదైన ఘతన సాధించింది.



# మత్స్యకారుల పొట్ట కొడుతున్నారు: వైఎస్ జగన్

'రాష్ట్రంలో మత్స్యకారుల అభ్యున్నతి కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తే, ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ వారి కడుపుపై తంతోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా, ఎప్పుడూ జరగని విధంగా, చూడని విధంగా రూ.3,800 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, రూ.150 కోట్లతో 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, దాదాపు రూ.16 వేల కోట్లతో 4 పోర్టులు.. మొత్తంగా రూ.20 వేల కోట్లతో ఆ పనులన్నింటికీ శ్రీకారం చుట్టాం. అవే కాకుండా అదనంగా మరో రూ.6 వేల కోట్లతో మొత్తంగా రూ.26 వేల కోట్లతో పోర్టులకు సంబంధించి విస్తరణ ప్రణాళిక కూడా సిద్ధమైంది. మా హయాంలోనే దాదాపు 95 శాతం ప్రాజెక్ట్‌ల పనులు పూర్తి చేశాం. మా ప్రభుత్వ హయాంలోనే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి చేశాం. 2024 మార్చి 12న ఎన్నికల కోడ్ రావడంతో ప్రత్యక్ష ప్రారంభానికి వీలుపడలేదు.

అదే ఏడాది ఆగస్టులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రెండేళ్ల క్రితమే జాతికి అంకితమైన ఈ ఫిషింగ్ హార్బర్‌ను దురదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మత్స్యకారులకు అప్పగించకుండా కుట్రులతో వ్యవహరిస్తోంది' అని నిప్పులు చెరిగారు. బుధవారం వైఎస్ జగన్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం బోగోలు మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. స్థానిక మత్స్యకారులతో మమేకమయ్యారు. అనంతరం వారినుద్దేశించి మాట్లాడారు. రెండేళ్లయినా ఇంత వరకు దీనిని గంగపుత్రులకు అప్పగించకుండా వారి పొట్ట కొట్టేందుకు చంద్రబాబు సర్కారు హార్బర్ భూములను సాగర్ డిఫెన్స్ సంస్థకు కట్టబెట్టిందని ధ్వజమెత్తారు. 'జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమే కుట్ర చేస్తోంది. రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. మేము రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని అక్కడి నుంచి తరిమేస్తాం. రాష్ట్రంలోని 10 ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు, ఆస్తి. వాటిని ఎవరూ సొంతం చేసుకోలేరు. మత్స్యకారులందరినీ పక్కాగా మ్యాపింగ్ చేసి, ఆర్థిక తోడ్పాటు అందించి.. ఆ హార్బర్ల పరిధిలోనే మెకనైజ్డ్ బోట్లకు యజమానులను చేస్తాం' అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎంత ఘోరంగా అన్యాయాలు జరుగుతున్నాయనడానికి ఈ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఉదాహరణ. మా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా మొత్తంగా రూ.26 వేల కోట్లతో అన్ని రకాల అనుమతులతో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల పనులు ప్రారంభించాం. ఇప్పటికే మూలపేట, మచిలీపట్నం పనులు 35 శాతం పూర్తి కాగా, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయి. ఫిషింగ్ హార్బర్లలో జువ్వలదిన్నెను కూడా పూర్తి చేశాం. రాష్ట్రంలో అంతకు ముందు 4 ప్రదేశాల్లో 6 పోర్టులు ఉంటే, కొత్తగా మరో నాలుగు పోర్టులకు శ్రీకారం చుట్టాం. వాటి ద్వారా వాళ్ల జీవన ప్రమాణాలు మెరుగు పడాలని రాష్ట్రవ్యాప్తంగా ఒక వ్యావ్ గీసి పనులు చేపట్టాం. ఎక్కడెక్కడైతే మత్స్యకారులున్నారో వాళ్లందరికీ హక్కుగా ఫిషింగ్ హార్బర్లు రావాలి. దేవుడి దయతో మన ప్రభుత్వ హయాంలోనే వీట న్నింటికీ వేగంగా అడుగులు ముందుకు పడ్డాయి. పోర్టులకు సంబంధించి కీలకమైన భూ సేకరణలు కూడా పూర్తి చేసి, అన్ని రకాల అనుమతులు తీసుకొచ్చాం. ఈ పోర్టులన్నింటినీ ఎటువంటి ఇబ్బంది లేకుండా, బ్యాంకు రుణాలను సైతం దీనికి టై అప్ చేశాం. ఫైనాన్సియల్ క్లోజర్ కూడా కంప్లీట్ చేసి, మారిటైమ్ బోర్డు క్రియేట్ చేశాం. అన్ని రకాలుగా ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోయాం. రామాయపట్నం పోర్టులో దాదాపు 95 శాతం ప్రాజెక్టు కూడా పూర్తి చేశాం. శ్రీకాకుళంలోని మూలపేట పోర్టులో కీలకమైన భూసేకరణతో పాటు, అన్ని రకాల అనుమతులు, ఫైనాన్షియల్ టైఅప్ కూడా పూర్తి చేసి, ఆ ప్రాజెక్టులో కూడా దాదాపు 35 శాతం పనులు వేగంగా పరుగెత్తించగలిగాం. అప్పటికే పనులు మొదలయ్యాయి. బ్యాంకుల్లో డబ్బులున్నాయి. ఇక వాళు పనులు చేసుకుంటూ పోతే చాలు ప్రాజెక్టుకు ఎటువంటి అభ్యంతరాలు, అవాంతరాలు లేకుండా పూర్తవుతుంది. ఆ స్టేజ్‌లోకి వాటిని తీసుకొచ్చాం. మచిలీపట్నంలో కూడా భూ సేకరణ పూర్తి చేసి, అన్ని అనుమతులూ తీసుకొచ్చి బ్యాంకులతో టై అప్ చేసి, లోన్లన్నీ శాంక్షన్ చేయించాం. మారిటైమ్ బోర్డు ద్వారా పూర్తిగా పనులు చేసి, దాంట్లో కూడా దాదాపు 35 శాతం పనులు మన ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. కాకినాడ వద్ద ఇంకో ప్రైవేట్ పోర్టు కూడా వేగంగా పనులు మొదలు పెట్టింది. ప్రైవేట్ పోర్టు పక్కన పెడితే ప్రభుత్వ రంగంలో ఉన్న 3 పోర్టుల పనులు రెండేళ్లవుతున్నా ఎందుకు జరగడం లేదు? దీనిపై చంద్రబాబును గట్టిగా నిలదీస్తున్నా. ఇవి కాకుండా దాదాపు రూ.3,800 కోట్లతో మొదలు పెట్టిన 10 కొత్త ఫిషింగ్ హార్బర్లు. ఇందులో జువ్వలదిన్నె ప్రాజెక్టు ఒకటి.

# కదిరిలో భారీ పేలుడు

ఆకాశం విరిగినట్లు ఒక్కసారిగా కుదుపు భారీ శబ్దంతో పేలుడు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ఒక్కసారిగా అలజడి రేగింది. భారీ శబ్దంతో ఓ ఇంట్లో డిటోనేటర్లు పేలాయి. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. అరుపులు కేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కుమ్మరవాండ్లపల్లిలో ఓ ఇంట్లో భారీ శబ్దంతో డిటోనేటర్లు పేలాయి. వాటి తీవ్రతకు ఇల్లు ధ్వంసమైంది. చుట్టుపక్కల నివాసాలు దెబ్బతిన్నాయి. పేలుడు ధాటికి ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భీతావహ వాతావరణం ఏర్పడింది. చుట్టుపక్కల వాళ్లు ఏం జరిగిందో తెలుసుకునేలోపే తీవ్ర విషాదం నెలకొంది. రెప్పపాటులోనే కొందరు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన స్థానికులు ఆసుపత్రికి తరలించారు. 11 మంది పరిస్థితి విషమం: ప్రమాదం జరిగిన ఇంట్లో ఉంటున్న వారు డిటోనేటర్లు నిల్వ ఉంచినట్లు స్థానికులు తెలిపారు. అవి పేలడంతోనే భారీ ప్రమాదం జరిగిందన్నారు. నివాసంలోని గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకొని అవి కూడా పేలాయని దీంతో మంటలు పెద్దఎత్తున ఎగిసిపడ్డాయని తెలిపారు. ఈ దృశ్యాలను చూసి హడలిపోయామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో 11 మంది పరిస్థితి విషమం ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో కుమ్మరవాండ్లపల్లికు చెందిన మహబూన్నీసా, పి.విశ్వనాథ్ రెడ్డి, మధుసూదన్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఒకరు కదిరికి చెందిన అస్లాం బాషాగా తేల్చారు. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఫక్రుద్దీన్ ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. పేలుడు తర్వాత ఘటనా స్థలిని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పరిశీలించారు. తీవ్ర విషాదానికి సంబంధించిన వివరాలను స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. బాధితులను ఓదార్చిన ఎమ్మెల్యే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు అనంతరం ఎస్పీ సతీష్‌కుమార్ ఘటనాస్థలిని పరిశీలించారు. ఇంట్లో డిటోనేటర్లు పెట్టుకున్న వారిని పట్టుకుంటామన్నారు. క్షతగాత్రుల పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండ: ఈ డిటోనేటర్ల పేలుడు ఘటనపై స్పందించిన మంత్రి అనిత కలెక్టర్, ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డిటోనేటర్లు పేలి ఐదుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని ప్రమాదంలో గాయాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలానే పేలుడుపై ఆరా తీసిన మంత్రి సత్యకుమార్ యాదవ్? క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

# దక్షిణాదికి ఎలాంటి నష్టం జరగదు

మహిళా బిల్లు లోక్ సభలో ఆమోదం పొందిన వెంటనే అక్కడే మద్దతు తెలుపుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ ఇలా వివిధ పార్టీల నేతలు మాట్లాడేలా కార్యక్రమం రూపొందించాలని నిర్ణయించారు. ఢిల్లీ పరిణామాలు, పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్, పల్లా శ్రీనివాసరావులు దాదాపు దాదాపు రెండున్నర గంటలకు పైగా కీలకంగా చర్చించుకున్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై వివిధ పార్టీలు లేవనెత్తిన సందేహాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది. 3 పార్టీల నేతలు పూర్తి సంతృప్తి వ్యక్తం: కొన్ని పార్టీలు చెప్తున్నట్లుగా దక్షిణాది రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంపు లేదనే వాదనపై కేంద్ర పెద్దల నుంచి నేతలు స్పష్టత తీసుకున్నట్లు సమాచారం. కేంద్ర న్యాయశాఖ మంత్రితో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి మరికొందరితోనూ మాట్లాడి బిల్లుపై స్పష్టత తీసుకుని వారిచ్చిన వివరణతో 3 పార్టీల నేతలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంపుపై కేంద్రం నుంచి కూటమి నేతలకు స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. 50 శాతం నియోజకవర్గాల సీట్లు పెంపుపై దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదని దీనిని రాజకీయంగా కలసి కట్టుగా స్వాగతించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ నిర్ణయించారు. కొందరు చేసేది అనవసర దుష్ప్రచారమని ఈ సందర్భంగా నేతలు నిర్ధారించుకున్నట్లు సమాచారం. జనాభా తో సంబంధం లేకుండా దక్షిణాదికి రాజకీయంగా నష్టం లేకుండానే బిల్లు రూపొందిందని కేంద్ర పెద్దల నుంచి నేతలు ఈ మేర స్పష్టత తీసుకున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా నేతలు చర్చించారు. 3 పార్టీల నేతలు కలిసి పెద్ద తెరపై కార్యక్రమం వీక్షించే ఏర్పాటు ఉంటే బాగుంటుందనే పవన్ ప్రతిపాదనకు అంగీకారం తెలిపిన సీఎం ప్రజా ప్రతినిధులందరినీ భాగస్వాముల్ని చేసేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. జిల్లా, నియోజకవర్గాల స్థాయిలోనూ భారీ ఎత్తున కార్యక్రమాలు చేపట్టి మహిళా సోదరీమణులకు, ప్రధానికి ధన్యవాదాలు తెలపాలని నిర్ణయించారు. అన్ని నియోజకవర్గాల్లో లైవ్ స్ట్రీమింగ్?లు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

# ఏపీలో నేటి నుంచే జనగణన

**"కేంద్ర, రాష్ట్ర ప్రణాళికలకు సెన్సస్ ప్రామాణికం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వ సెన్సస్ ఇది. జనాభా గణన ఫిబ్రవరిలో జరుగుతుంది. ఈలోగా ఇంటి లెక్కలు పూర్తవుతాయి. సెన్సస్ ప్రక్రియకు ప్రజలు పూర్తిగా సహకరించాలి. ఇంటి నంబర్ల నమోదు ప్రక్రియకు ఎలాంటి అడ్డంకులు పెట్టవద్దు. సెన్సస్ సమాచారమే ప్రభుత్వ పథకాలకు కీలక ఆధారం. సెన్సస్‌కు అడ్డంకులు కల్పిస్తే క్రిమినల్ చర్యలు".-**

**జె.నివాస్, సెన్సస్ అధికారి**

నేటి నుంచే ఏపీలో సెన్సస్ 2027 ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఏపీ జనగణన అధికారి జె. నివాస్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రణాళికలకు సెన్సస్ ప్రామాణికమని తెలిపారు. ప్రస్తుతం జరిగేది 16వ సెన్సస్ అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వ సెన్సస్ అని నివాస్ వివరించారు. జనాభా గణన ఫిబ్రవరిలో ప్రారంభమవుతుందని, ఈ లోపు హౌస్ లిస్టింగ్ జరుగుతుందని స్పష్టం చేశారు. సెన్సస్ ప్రక్రియకు ప్రజలు పూర్తి సహకరించాలని కోరారు. ఎన్యూమరేటర్లకు అవసరమైన వివరాలు తప్పకుండా అందించాలని, ఇంటి నంబర్లు నమోదు చేసే ప్రక్రియకు ఎటువంటి అడ్డంకులు పెట్టొద్దని తేల్చిచెప్పారు. సెన్సస్ సమాచారం ప్రభుత్వ పథకాలకి కీలక ఆధారమని నివాస్ చెప్పారు. సెన్సస్‌కు అడ్డంకులు కల్పిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ప్రజలంతా భాగస్వాములు కావాలి:** జనగణన 2027 తొలిదశలో భాగంగా ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్వీయ గణన జరుగుతుందని ఇందులో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డాక్టరు లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. జనగణనలో తొలిసారిగా ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ష్ట్రజూం://ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.అఅ పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని చెప్పారు. దీనివల్ల సమయం ఆదాతో పాటు దోష రహితంగా కచ్చితమైన డేటా లభిస్తుందని వివరించారు. 34 అంశాలను ఈ గణన ద్వారా ప్రజలు తమ వివరాలను తెలియజేయాల్సి ఉంటుందని కలెక్టరు అన్నారు. స్వీయ గణనపై ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని 16వ తేదీన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ, ఎంపీపీలు, ఛైర్‌పర్సన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను స్వీయ గణనలో భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. అలాగే 17వ తేదీన సచివాలయ సిబ్బంది, హెచ్‌వోడీ కార్యాలయాల సిబ్బంది, జిల్లా కార్యాలయాల సిబ్బంది, మండల కార్యాలయాల సిబ్బంది తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా ఏప్రిల్ 30వ తేదీ వరకు వివిధ వర్గాల ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

# లోక్‌సభ ముందుకు డీలిమిటేషన్ బిల్లు

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం గురువారం దానిని లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ఈ బిల్లును సభ ముందుకు తీసుకురానున్నారు. అనంతరం బిల్లుపై చర్చ జరగనుంది. ఇప్పుడున్న లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్య 815గానూ, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉంది. కానీ ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మరోవైపు మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్రం తీసుకొస్తోంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి, గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల్ని పునర్విభజించడానికి కేంద్రం తాజా బిల్లు తీసుకొస్తోంది. 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334లకు సవరణలు ప్రతిపాదించింది. అయితే లోక్‌సభ సీట్లను 850కి ఏ ప్రాతిపదికన పెంచుతున్నారనే విషయాన్ని బిల్లులో కేంద్రం స్పష్టంగా చెప్పలేదు. పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50 శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ నివేదిక ఇచ్చే వరకూ ఏ రాష్ట్రంలో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తిని కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ లేదా ఆయన ప్రతినిధి ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు కూడా ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. ఈ కమిషన్ దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. అందుబాటులో ఉన్న జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది డిలిమిటేషన్ కమిషన్ నిర్ణయిస్తుంది. రాష్ట్రాల వారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

# 180 మందిపై అత్యాచారం..!

మహారాష్ట్రలో దారుణం చోటుచేసుకుంది. 19 ఏళ్ల యువకుడు.. మైనర్ బాలికలను ప్రేమ పేరిట ట్రాప్ చేసి, వారిని అశ్లీలంగా వీడియోలు తీశాడు. వాటిని ఆన్‌లైన్‌లో షేర్ చేశాడు. ఇలా దాదాపు 180 మంది బాలికలను లైంగికంగా వేధించాడని.. 350కిపైగా వీడియోలు చిత్రీకరించాడనే ఆరోపణలతో మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన అయాన్ అహ్మద్ తన్వీర్‌ను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై పోక్సో చట్టంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కోర్టు అతనికి ఈ నెల 21వరకూ డిమాండ్ విధించింది. తన్వీర్ దాదాపు 180 మంది బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలు ఉన్నప్పటికీ.. పోలీసులు మాత్రం ఇప్పటివరకూ 8 మంది బాధితులనే గుర్తించారు. పోలీసులు అతని మొబైల్ ఫోన్‌లో పలు వీడియోలను స్వాధీనం చేసుకున్నారు. అయాన్ మైనర్ బాలికలను టార్గెట్ చేసి వారితో స్నేహం చేసేవాడని, ఆపై ప్రేమ పేరుతో ట్రాప్ చేసేవాడని పోలీసులు విచారణలో తేలింది. ఆ తర్వాత వారిపై లైంగికంగా దగ్గరయ్యేవాడని, ఈ క్రమంలో అనుమతి లేకుండా వీడియోలు తీసేవాడని వెల్లడైంది. అనంతరం ఆ వీడియోలు చూపించి వారిని బ్లాక్‌మెయిల్ చేసేవాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఉజర్ ఖాన్ అనే మరో యువకుడిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. అతను తన మొబైల్ ఫోన్ నుంచి ఇలాంటి అశ్లీల వీడియోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్టు ఆరోపణలున్నాయి.

# వచ్చేసింది యువరాణి

ఈ విజయంతో చదరంగ యువరాణిగా నిలిచిన వైశాలి.. చాలెంజర్ హోదాలో ప్రపంచ టైటిల్ కోసం డిఫెండింగ్ చాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ వెన్‌జున్‌తో తలపడేందుకు అర్హత సాధించింది. ఈ ఏడాది ఆఖర్లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ వేదిక, తేదీలను ఫిడే ఖరారు చేయాల్సి ఉంది. ఇక..క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ జవోఖిర్ సిందరోవ్ మంగళవారంనాటి 13వ రౌండ్ నాటికే విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. దరిమిలా..ప్రస్తుత వరల్డ్ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ తో టైటిల్ కోసం సిందరోవ్ పోటీపడతాడు.

**ఒత్తిడిని అధిగమించి..:** బుధవారం తప్పక గెలవాల్సిన క్యాండిడేట్స్ టోర్నీ ఆఖరిదైన 14వ రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన వైశాలి 48 ఎత్తుల్లో కాటరినా లగ్నో (రష్యా)ను చిత్తు చేసింది. దాంతో మొత్తం 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన వైశాలి క్యాండిడేట్స్ టైటిల్ సొంతం చేసుకుంది. అంతకుముందు రోజు 13వ రౌండ్ ముగిసే సరికి బిబిసార అసుబయేవా (కజకిస్థాన్), వైశాలి చెరో 7.5 పాయింట్లతో టైటిల్ రేసులో నిలిచారు. కానీ చివరి రోజు ఆఖరి గేమ్‌లో బిబిసారను భారత గ్రాండ్‌మాస్టర్ దివ్యా దేశ్‌ముఖ్ నిలువరించింది. ఫలితంగా బిబిసార 8 పాయింట్లతో నిలిచింది. ఈనేపథ్యంలో లగ్నోతో ఆఖరి రౌండ్‌లో వైశాలి నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే తీవ్ర ఒత్తిడి అధిగమించి, లగ్నోను ఓడించడంతో క్యాండిడేట్స్ కిరీటం వైశాలికి దక్కింది. ఓవరాల్‌గా 14 రౌండ్లలో ఐదు గేమ్‌లను గెలిచిన వైశాలి, ఏడింటిని డ్రా చేసుకుంది. రెండు గేమ్‌లలో ఓటమి పాలైంది. ఈ టైటిల్‌తోపాటు వైశాలి రూ. 31 లక్షలు ప్రైజ్‌మనీగా అందుకుంది. బిబిసార రన్నర్‌పగా నిలిచింది. దివ్య 5.5 పాయింట్లతో ఏడో స్థానంతో టోర్నీని ముగించింది. ఓపెన్ విభాగంలో సిందరోవ్‌కు టైటిల్ గత రౌండ్‌లోనే ఖరారుకాగా..బుధవారం జరిగిన 14వ రౌండ్‌లో వీ యీ (చైనా)తో గేమ్‌ను అతడు డ్రా చేసుకున్నాడు. మొత్తం 10 పాయింట్లతో సిందరోవ్ అగ్రస్థానంలో నిలిచాడు. డచ్ గ్రాండ్‌మాస్టర్ అనీష్ గిరి (8.5) రన్నర్‌పతో సరిపెట్టుకున్నాడు. వైశాలి సోదరుడు ప్రజ్ఞానంద 6.5 పాయింట్లతో ఏడోస్థానానికి పరిమితమయ్యాడు. నకమురా (అమెరికా)తో ఆఖరి రౌండ్‌ను ప్రజ్ఞానంద డ్రాగా ముగించాడు.

# నేడు కేజీ బేసిన్ గ్యాస్, చమురు సాధన కోసం సదస్సు

**-మన గ్యాస్ మన చమురు మన ఏపీ హక్కు**
**-ఏపీ కు 50 శాతం వాటా ఇవ్వాల్సిందే**
**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటి పాక మధు, సిపిఎం జిల్లా కార్యదర్శి టి. అరుణ్**

**రాజమండ్రి : ఏప్రిల్ 15:** కేజీ బేసిన్ గ్యాస్ చమురుసాధన సమితి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నగరంలో సంహిత కన్వెషన్ హాల్ లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటి పాక మధు,సిపిఎం జిల్లా కార్య దర్శి టి. అరుణ్ తెలిపారు. నగరంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్, మధు మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ప్రత్యేక హటరీదా విభజన హామీల ఎ ధన సమితి కన్వీనర్ నాయకులు చలసాని శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ ల క్ష్మణరావు, సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ప్రసాద్, చీకట్ల వెంకటేశ్వర రావు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కార్యదర్శి సుందరరామరాజు తదితరులు 12 మంది వక్తలు రానున్నారని తెలిపారు. కాకినాడలో 30కి. మీ దూరంలో చమురు ఉత్పత్తి జరుగుతుందని అని న్నారు. గతంలో గాడిమొగలోనూ గ్యాస్ ఉ త్పత్తి జరుగుతుందని గుర్తు చేశారు. సహజవనరులు ఒ క ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించేప్పుడు ఆ రాష్ట్రానికి పన్నులు చెల్లించాలనే సుప్రీ 0 కోర్టు తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ వనరులు ఆ రాష్ట్రానికి 50 శాతం దక్కాలని 12వ ఫైనాన్స్ చెప్పిందని అన్నారు అయితే పెట్రోలియం స్టాండి



ంగ్ కమిటీ చైర్మన్ గా 2013లో జరిగి ఏకగ్రీవ తీర్మాణం ఈ సందర్భంగా గుర్తుచేశారని తెలిపారు . కేజీ బేసిన్ గ్యాస్ చమురు నిక్షేపాలు ఏ ప్రాంతంనుంచి తీసుకెళితే ఆ రాష్ట్రానికి రాయల్టీగా చె ల్లించాలని అన్నారు. రాజస్థాన్కు, మరి కొన్ని రాష్ట్రాలకు ప్రతి ఏటా ఐదువేల కోట్ల రూపాయలు ఈ విధంగా చెల్లిస్తున్నారని వివరించారు. ఈ రాష్ట్రం నుంచి అధిక మొత్తంలో గ్యాస్, చమురు నిక్షేపాలను తరలిస్తున్న నేపథ్యంలో ఐదువేల కోట్ల పైబడి వచ్చే అవకాశం ఉంది. కానీ ఆంధ్ర రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా చెల్లించటంలేదని అన్నారు. ప్రజల గ్యాస్ అవసరాల కోసం ఉచి తంగా పంపిణీ చేయాలని ఏకగ్రీవ తీర్మాణం ప్రభుత్వానికి అందజేసిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్ కూడ తమ వద్ద ఉందని వివరించారు. ఆ నాటి ఒప్పందం ప్రకారం 50 శాతం వాటా రాష్ట్రాని కి కేటాయిస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ఆ నాటి లెక్కల ప్రకారం గ్యాస్ ఉచితంగా పంపిణీ చేయవచ్చు. చమురు రేట్లు కూడా తగ్గించే అవకాశం ఉంది. ఆ పని చేయటంలేదని అన్నారు. 2 014 అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదు. కేజీ బేసిన్లో డి6 రిలయన్స్ కు కేటాయించారని.. 10 టిఎఫ్ సిలు ఉత్పత్తి అవుతుందని ఆనాడు చెప్పారని గుర్తు చేశారు. తర్వా త కాలంలో 3 టిఎఫిసిల కంటే అధికంగా రావట్లేదు. కావున ప్రభుత్వమే తమకు తిరిగి చెల్లించాలని కోరిందని వివరిస్తూ, ఇది పూర్తిగా మోసపూరితమని అన్నారు. డి6 బ్లాకు నుంచి గుజరాత్ కు అక్కడి నుంచి ఇతర దేశాలకు తరలించి లక్షల కోట్లు లాభాలు ఆర్జించిందని తెలిపారు. అదే రిలయన్స్ డి5 శీఅస్త్రష నుంచి పైపులు వేసి దొంగతనంగా గ్యాస్ ను పట్టుకుపోయిందని, ఆనాటి లెక్క ప్ర కారం ఏటా 10వేల కోట్ల విలువ చేసే చమురుని తరలించుకుపోయిందని కేంద్ర ప్రభుత్వం నిర్ధారణ చేసిన తర్వాత కూడా రిలయన్స్ పై ఎటువంటి నేరం, శిక్ష ఎటువంటి రాయల్టీ చెల్లింపులు లేవని అన్నారు.. సహజ వనరులు మొత్తాన్ని రిలయన్స్ వంటి సంస్థలు లక్షల కోట్లు ఆర్జిస్తుంటే, రాష్ట్ర ప్రజలు గ్యాస్ అందుబాటులో లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆరోజు అనేక మంది మేధావులు, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీలు ఆందోళన చేశారని గుర్తు చేశారు. ఈ 20 ఏళ్లలో వచ్చిన మార్పులు రీత్యా ప్రజల అవసరాలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ందుకు పెద్ద ఎత్తున ఆందోళన చేసి సాధించాలనే సంకల్పంతో కేజీ బేసిన్ గ్యాస్ చమురు సాధ న సమితి ఏర్పడిందని అన్నారు. మన గ్యాస్ మనకే దక్కాలి అనే నినాదంతో జరిగే ఈ సదస్సుకు అన్నివర్గాల ప్రజలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. పవన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లం వెంకటేశ్వరావు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూర్ణిమ రాజ్,ఐ. సుబ్రహ్మణ్యం, వి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో నేటి అర్ధరాత్రి నుంచి జూన్ 14 వరకు వేటకు విరామం



చేపల పునరుత్పత్తి కోసం 61 రోజులపాటు అమలు చేయనున్న వేట నిషేధం మంగళవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తుంది. తూర్పు తీర భారత ప్రాదేశిక జలాల్లో జూన్ 15 వరకు ఈ నిషేధం అమలులో ఉంటుంది. సముద్రంలో మత్స్య సంపద వృద్ధి, పరిరక్షణ, నిర్వహణకై ఏటా క్రమం తప్పకుండా ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఈ సమయంలో మోటారు వినియోగించని సాంప్రదాయ బోట్లకు వేట నిషేధం నుంచి మినహాయింపు ఉంది వేట నిషేధం ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా, బోటు స్వాధీనం, రిజిస్ట్రేషన్ రద్దు.. మత్స్యకార భరోసా కింద రూ.20 వేలు అందించనున్న ప్రభుత్వం

# టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంత్రి నారా లోకేష్

పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవాన్ని లెక్కలోకి తీసుకుని పదవులు ఇచ్చిన అధిష్టానం. పనిచేసేవారికే పార్టీలో పెద్దపీట అన్న సంకేతాన్ని ఇచ్చిన పార్టీ. కార్యకర్తే పార్టీకి అధినేత అన్న వినూత్న ఆలోచనలతో పార్టీని తిరుగులేని సైన్యంగా తీర్చిదిద్దుతున్న మంత్రి లోకేష్ కు టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పచెప్పింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి పల్లా శ్రీనివాస్ నియమించబడ్డారు. సీనియర్లకు గౌరవం... కొత్తవారికి అవకాశాలు...మరియు సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగినట్టు తెలుస్తోంది. 29 మందితో పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ అయిన పొలిట్ బ్యూరో నియామకాలు జరిగాయి. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్ లకు పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుదు గారు కీలకనిర్ణయం తీసుకున్నారు. 31 మందితో కూడిన జాతీయ కమిటీలో ముగ్గురు జాతీయ ప్రధాన కార్యదర్శులు కాగా 18 మందిని జాతీయ ఉపాధ్యక్షులుగా, 10 మందిని జాతీయ అధికార ప్రతినిధులుగా నియమించింది. రాష్ట్ర కమిటీలో 185 మంది ఉండగా వీరిలో 7గురు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, 16 మంది రాష్ట్ర ఉపాధ్యక్షులు, 14 మంది రాష్ట్ర అధికార ప్రతినిధులు, 10 మంది రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు, 59 మంది రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు, 77 మంది రాష్ట్ర కార్యదర్శులు ఉన్నారు. నాలెడ్జి కమిటీ, హెచ్ఆర్డీ కమిటీల్లో ఒక్కొక్కరిని నియమించారు. రేపు పార్లమెంటులో మహిళా బిల్లు ప్రవేశపెడుతున్న శుభవేళ... టీడీపీ రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు కల్పించింది. అలాగే పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించింది. 185 మంది రాష్ట్ర



కమిటీ సభ్యుల్లో 122 మంది (బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13) బడుగులకు చంద్రబాబుగారు చోటు కల్పించారు. పార్టీకి యువ నాయకత్వం అందుబాటులోకి వచ్చేలా నియామకాలు జరిగాయి. అలాగే నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం జరిగింది. ముఖ్యంగా పార్టీ బలోపేతానికి కష్టపడిన వారికి, విధేయులకు పెద్ద పీట వేశారు....

# టిడిపి కార్యకర్తలే నా బలం.. బలగం - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**- నెల్లూరులోని విపిఆర్ కార్యాలయంలో టిడిపి కార్యకర్తల సంబరాలు.**
**- ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి అభినందనలు వెల్లువ.**
**- భారీగా బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కార్యకర్తలు.**



తెలుగుదేశం పార్టీలో అత్యున్నత నిర్ణయాత్మక విభాగమైన పొలిట్ బ్యూరో సభ్యురాలుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నియామకం కావడంతో నెల్లూరు జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. టిడిపిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ని అభినందించేందుకు కోవూరు నియోజకవర్గంతో పాటు నెల్లూరు జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా విపిఆర్ కార్యాలయానికి తరలి వచ్చారు. నెల్లూరు నగరంలోని మాగుంట లే అవుట్లో ఉన్న ఈ కార్యాలయం విపిఆర్ జిందాబాద్, చంద్రబాబు లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి అనే కార్యకర్తల నినాదాలతో మార్మోగింది. కార్యాలయ ప్రాంగణంలో భారీగా బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.కార్యకర్తల మధ్య ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ నేతలు ఆమెను గజమాలలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. పదవులు ఎన్ని వచ్చినా తన బలం, బలగం ఎప్పుడూ కార్యకర్తలే అన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా టీడీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని ఆమె భరోసా యిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా నేతలు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి అభినందనల వర్షం కురిపించారు.

# నేటి నుంచి నెల్లూరు జిల్లాలో "పల్లె వీక్షణ" సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**ఏసిపోగు బాబు విజ్ఞాన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు** ఆత్మకూరు మండలం నబ్బీ నగరం, బోయిల చిరువెళ్ల గ్రామాల నుంచి పల్లె వీక్షణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా.. బుధవారం ఉదయం నుండి జిల్లా అధికార యంత్రాంగం తో కలసి ఆత్మకూరు మండలం నబ్బినగరం,బోయిలచిరివెళ్ల గ్రామాలలో పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయి లో పరిశీలించి తెలుసుకున్నారు. అదేవిధంగా బోయిలచిరివెళ్ల గ్రామములో రైతు సేవా కేంద్రం, విల్లెజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రం, హోసింగ్ కాలనీ, మినీ గోకులం, సందర్శించడం జరిగింది. నబ్బినగరంలో ఉపాధిహామీ పనుల వద్దకు నేరుగా వెళ్లి కూలీలతో ముచ్చటించారు. అదేవిధంగా బోయిలచిరివెళ్ల వీదుల్లో నడుచుకుంటూ, ప్రజలనుండి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామములో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి స్థానిక అధికారుల తీరుపైన స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రతివారం ఒక గ్రామములో అధికార యంత్రాంగం తో కలసి పర్యటించి, నేరుగా ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమమే "పల్లె వీక్షణ "కార్యక్రమం అని తెలిపారు. గ్రామములో ప్రతి సమస్య కు పరిస్కారం చూపడమే "పల్లె వీక్షణ" లక్ష్యమని కలెక్టర్ హిమాన్షు శుక్ల గారు తెలిపారు.

# అంగరంగ వైభవంగా అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవం..!





**-ఎమ్మెల్యే కాకర్ల సురేష్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా ఘన ప్రారంభం..!**
**-నిరుపేద ప్రజల ఆకలి తీర్చే "అన్నపూర్ణ"గా అన్నా క్యాంటీన్..!**
**-పేదలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..!**



**ఉదయగిరి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 15** ఉదయగిరి నియోజకవర్గ నిరుపేద ప్రజల ఆకలి బాధలను తగ్గించే దిశగా మరో కీలక అడుగు పడింది. వింజమూరు పట్టణంలోని బంగ్లా సెంటర్ వద్ద (ఎమ్మార్వో కార్యాలయం పక్కన) నూతనంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఘనంగా, అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , వక్ఫ్ బోర్డ్ చైర్మన్ శ్రీ అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా క్యాంటీన్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అన్నా క్యాంటీన్ ప్రధాన లక్ష్యం నిరుపేదలు, దినసరి కూలీలు, కార్మికులు, అలాగే పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు తక్కువ ధరలో పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించడం. పెరుగుతున్న జీవన వ్యయాల మధ్య సామాన్య ప్రజలకు ఇది ఎంతో ఉపశమనం కలిగించే కార్యక్రమంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సేవలను ఎనలేనివని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సంక్షేమం దృష్ట్యా అన్నా క్యాంటీన్లను తిరిగి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా తొలి సంతకం చేయడం ఎంతో గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 269 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి, ప్రతి రోజు లక్షలాది మంది పేదల ఆకలి తీర్చడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో వందల కోట్ల రూపాయలను ఖర్చు చేసి, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా ఈ సేవలను విస్తరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. వక్ఫ్ బోర్డ్ చైర్మన్ శ్రీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ఈ అన్నా క్యాంటీన్లు సమాజంలో బలహీన వర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకా హరే కృష్ణ అక్షయపాత్ర ఫౌండేషన్ సంస్థ అన్నా క్యాంటీన్లకు అల్పాహారం మరియు భోజనం సరఫరా చేస్తూ సమాజానికి అమూల్యమైన సేవలను అందిస్తున్నదని ప్రశంసించారు. వారి సహకారం వల్లే ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.

# గడ్డం వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల దంపతులు..!

**- నూతన వధూవరులను ఆశీర్వదించిన కాకర్ల దంపతులు**



**ఉదయగిరి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ఏప్రిల్ 15** ఉదయగిరి మండల కేంద్రంలోని శుభమస్తు కళ్యాణమండపం నందు కొట్టాయపల్లి సొసైటీ అధ్యక్షులు గడ్డం వెంకటేశ్వర్లు , కొండమ్మ దంపతుల కుమారుడు ప్రసాద్ -- వధువు సరళ వివాహ వేడుకలు ఈ పవిత్ర వేడుకకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , కాకర్ల ప్రవీణ విచ్చేసి నూతన వధూవరులను ఆత్మీయంగా ఆశీర్వదిసన్తూ అక్షింతలు వేసి, వారి దాంపత్య జీవితం ఆనందమయం, ఆయురారోగ్యాలతో నిండి సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు.

# స్నేహం

స్నేహం అనేది
ఇద్దరి వ్యక్తుల మధ్య పరస్పర
ఆప్యాయతతో కూడిన సంబంధం
స్నేహమనేది వ్యక్తుల మధ్య
బంధం యొక్క బలమైన రూపం
నిజమైన స్నేహమే నవసంతం
అమ్మానాన్న
తొడబుట్టిన వాళ్ళు
బంధువర్గం మాత్రం
నువ్వు ఈ భూమీదకు రాగానే
బంధాలు ఏర్పడతాయి
కానీ... ఈప్రపంచంలో
నీకై నువ్వు నువ్వు మాత్రమే
సెలక్ట్ చేసుకునే ఛాయిస్ స్నేహితుడు
అందుకే... స్నేహం ఒక ప్రత్యేకం
స్నేహానికి ఒకే వయసు
స్నేహానికి ఒకే అంతస్థు
స్నేహానికి ఒకే హోదా
ఉండాల్సిన అవసరం లేదు
ఒకర్ని ఒకరు
అర్థం చేసుకునే
కల్మషం లేని రెండు నిండు
హృదయాలు ఉంటే చాలు.
అదే నిజమైన స్నేహంగా
ఆదర్శవంతంగా నిలుస్తుంది.



రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

# సిఎం నమ్మకాన్ని నిలబెడుతూ.. కార్యకర్తలుగా పనిచేస్తాం

**- స్పష్టం చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ**
**- పదవి అనేది బాధ్యత.. టిడిపి బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తాం.**
**- ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాం.**
**- సీఎం చంద్రబాబు ఆశీసులతో ఈ స్థాయిలో ఉన్నాం**
**- క్రమశిక్షణ కలిగిన పార్టీలో ఉండటం మాకు గౌరవం**

ప్రజాసేవలో అంకిత భావంతో, అభివృద్ధి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న కోవూరు ఎమ్మెల్యే శ్రీ మతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని తెలుగుదేశం పార్టీ అధిష్టానం తగిన గుర్తింపుతో గౌరవించింది. పార్టీలో అతిముఖ్యమైన పొలిట్ బ్యూరోలో సభ్యురాలిగా నియమించి ఆమె సేవలకు తగిన గుర్తింపు నిచ్చింది. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు , మంత్రి నారా లోకేష్ పొలిట్ బ్యూరో సభ్యులుగా నియమించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. తమకు పదవి బాధ్యత అని, కార్యకర్తలుగా నిరంతరం పార్టీ అభ్యున్నతికి పనిచేస్తామని ఎంపీ వేమిరెడ్డి దంపతులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ మహిళలకు నాయకత్వ బాధ్యతల్లో ప్రాధాన్యతనిస్తూ తనను పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు



నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, మరియు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కు ధన్యవాదాలు తెలిపారు. ఎన్టీఆర్ వేసిన క్రమశిక్షణాయుతమైన పునాదిపై చంద్రబాబు విజన్, లోకేష్ యువ నాయకత్వంలో పార్టీలో ఒక సైనికురాలిగా పనిచేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి మరియు కోవూరు నియోజకవర్గ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై ప్రశాంతి రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన జగన్ ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. నెల్లూరు జిల్లాలోని మత్స్యకారులను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్న జగన్ ప్రయత్నాలు విఫలమవుతాయని, మత్స్యకారులందరూ కూటమి ప్రభుత్వం వెంటే ఉన్నారని ఆమె స్పష్టం చేశారు. జువ్వలదిన్నె లో యువతకు ఉపాధి కల్పించాలని మంత్రి లోకేష్ ప్రారంభించిన డిఫెన్స్ పరిశ్రమ అడ్డుకోవాలని జగన్మోహన్ రెడ్డి కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. తన హయాంలో ఏం చేశారో చెప్పుకోలేక తానొస్తే అది చేస్తా.. యిది చేస్తానని ప్రజలను ప్రలోభ పెడుతున్నారన్నారు. అనంతరం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా అవకాశం కల్పించడం పట్ల చంద్రబాబు నాయుడు, లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవిని ఒక అలంకారంగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నామని, పార్టీ మరియు కార్యకర్తల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. టీడీపీలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని, క్రమశిక్షణ మరియు గౌరవం ఉన్న ఇటువంటి పార్టీలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఉన్నత పదవులు దక్కినప్పటికీ సామాన్య కార్యకర్తల్లాగే ప్రజలకు అందుబాటులో ఉంటూ, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని ఎంపీ వెల్లడించారు.

# నిరుపేదల ఆకలి తీర్చే అన్నపూర్ణ.. అన్నా క్యాంటీన్లు

**- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
**- పేదలు ఆకలితో ఉండకూడదు అనేదే సీఎం లక్ష్యం**
**- ఈ రోజు 62 అన్నా క్యాంటీన్ల ప్రారంభం**
**- రోజుకు 2.10 లక్షల మందికి భోజనాలు**

పేదలెవరూ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రి బి.సి జనార్ధన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ లో భోజనం చేశారు. ఇంటిలో భోజనం చేసిన అనుభూతి కలుగుతోందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ..నగరాలు, పట్టణాల్లో పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు.. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి వచ్చాయన్నారు. ముత్తుకూరు ప్రాంతంలో కూలీ పనులు చేసుకునేవారు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి బతికేవారు అధికంగా ఉంటారని, అలాంటి వారికి క్యాంటీన్ చాలా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 207 క్యాంటీన్లు ఉండగా.. ఇప్పుడు 62 క్యాంటీన్లు సీఎం చంద్రబాబు



నాయుడు ప్రారంభించారన్నారు. కొత్త వాటితో కలిపి వీటి సంఖ్య 269కి చేరిందని వివరించారు. వీటి ద్వారా రాష్ట్రంలో రోజుకు 2.20 లక్షల మంది భోజనాలు చేస్తున్నారని వివరించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకువెళుతున్నారని స్పష్టం చేశారు. అన్నా క్యాంటీన్లు సీఎం గొప్ప ఆలోచనలకు నిదర్శనమని, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 5లకే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందన్నారు. శుచి, శుభ్రత గల ఆహారాన్ని సరఫరా చేస్తున్న అక్షయ పాత్ర ఫౌండేషన్, హరేకృష్ణ ఫౌండేషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నా క్యాంటీన్ల సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నేడు కారంపూడిలో ప్రజా దర్బార్..!

**విజ్ఞాన దినపత్రిక, మణికుమార్,కారంపూడి (ఏప్రిల్ :16 )** కారంపూడి మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయం లో గురువారం ఉదయం 10.30 నిమిషాలకు ప్రజాదర్బార్ నిర్వహించబడుతుందని శాసన సభ్యులు వారి కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. స్వయంగా శాసనసభ్యులు తమ అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. కారంపూడి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాదర్బార్ లో సమస్యలను అర్జీలు సమర్పించే వారు తప్పనిసరిగా ఆధార్ జిరాక్స్ ను జత చేయాలని కోరింది. మండలంలో ఎవరికైనా సమస్యలు ఉంటే శాసనసభ్యుల వారి దృష్టికి అర్జీల ద్వారా తెలియజేయాలని కోరారు. అనంతరం కారంపూడిలో జలజీవన్ మిషన్ కార్యక్రమానికి శంకుస్థాపన చేపట్టనున్నారని తెలిపారు.




# ఐదేళ్లుగా వశిష్టదే టౌన్ ఫస్ట్ : కరస్పాండెంట్ సురేంద్ర రెడ్డి



**కావలి,, విజ్ఞాన్ దినపత్రిక రిపోర్ట్** కావలి వశిష్ట జూనియర్ కళాశాల ప్రారంభ సంవత్సరం నుంచి వరుసగా సాధిస్తున్న విజయాలు మరో సారి కైవసం చేసుకుంటోందని కరస్పాండెంట్ కోట సురేంద్ర రెడ్డి తెలిపారు నేటికీ ఐదవ సంవత్సరం లో ఇంటర్ ఫలితాల్లో టాప్ టౌన్ రికార్డు లను దక్కించుకుందని కళాశాల కరస్పాండెంట్ కాటా సురేంద్ర రెడ్డి తెలిపారు. యమ్.పి.సి మొదటి సంవత్సరం లో కె.శ్రీజ 465 తో కావలి టౌన్ సెకెండ్ స్థానం దక్కించుకోగా, బై.పి.సి లో సురెల్లీ డ్యానియెల్ 448 మార్కులతో కావలి టౌన్ ఫస్ట్ కైవసం చేసుకొంది. సెకెండ్ ఇయర్ యమ్.పి.సి లో ఐ.వి.రేవంత్ గోపాల కృష్ణ 990 మార్కులతో కావలి టౌన్ ఫస్ట్ ను సాధించగా, సెకెండ్ ఇయర్ బై.పి.సి లో 988 మార్కులతో కావలి టౌన్ ఫస్ట్, సి.ఇ.సి లో కె.శ్రీవాణి 971 మార్కులతో కావలి టౌన్ ఫస్ట్ లతో వశిష్ట రికార్డు ను కొనసాగించడం పట్ల కరస్పాండెంట్ సురేంద్ర రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. తమ కళాశాల మొదలు పెట్టిన తొలి సంవత్సరం నుంచి నేటికీ అయిదవ సంవత్సరం గా కావలి టౌన్ రికార్డు లు సాధించడం లో తమ అధ్యాపక బృందం చేస్తున్న అవిరళ కృషి, ఇందుకు సహకరిస్తున్న తల్లి తండ్రుల సహకారం వివరించి లేనిదని సురేంద్ర పేర్కొన్నారు. ఈ ఫలితాల స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కళాశాల ప్రతిష్ట ను ఈ ఏడాది కూడా కొనసాగించిన విద్యార్థులను, వీరితో పాటు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఉత్తమ ఫలితాలు వచ్చిన నేపథ్యంలో వశిష్ట లో పండుగ వాతావరణం నెలకొంది.

# పాతికేళ్లుగా శ్రీ చైతన్య విజయభేరీ : కన్వీనర్ నందనవనం మధు

**కావలి, విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** ఇరవై అయిదేళ్ళ ప్రస్థానంలో కావలి శ్రీ చైతన్య ఇంటర్ ఫలితాల్లో మరో సారి తన సత్తా చాటుకుందని కళాశాల కన్వీనర్ నందనవనం మధు సూధనరావు తెలిపారు. ఇంటర్ ఫలితాలలో కావలి శ్రీ చైతన్య నియర్ కళాశాల పట్టణంలో జూనియర్ మరియు సీనియర్ విభాగాలలో పట్టణాలలో ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా విజేతలైన విద్యార్థులను అభినందించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపు నందు ఎన్ భాగ్యలక్ష్మి 466/470 ఎన్ భారతి 465 కే పావని 465 ఈ శిరీష 465 డివి శివ భావన 464 ఏ వినయ్ కుమార్ 463 సాయి వీక్షిత్ 463 ఎం శ్రీ చరణ్ 463 బైపీసీ విభాగంలో కె సాయి కార్తిక 444/455 జీవీ సాయి మోక్షిత 44 3య నికిత 435 వై విలాషిని 433 జ్వలిత పి సిరి సహస్ర 431 ఎంఈసి విభాగంలో బి లక్ష్మీ మహతి 4 62 /500 సి ఈ సి విభాగంలో సిహెచ్ లతీక 448/500 పి చందన ప్రియ 424 డివి శిరీష 423 సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం దివ్యవాణి 990 /1000 ఆర్ లక్ష్మీ సుహిత 990 టీ భార్గవ రామిరెడ్డి 986 ఎస్ డి షాజిదా 985 బైపిసి విభాగంలో జి ధనుష్క 987/1000




ఎం నిహిత 971 సీఈసీ విభాగంలో ఆర్ హారిక 957 /1000 ఎం రోహిత సంజన 956 మార్కులు సాధించి పట్టణంలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారని, కళాశాల యాజమాన్యం తరపున విద్యార్థులను పుష్పగుచ్చములతో అభినందించారు. ఈ విజయంలో అత్యుత్తమ బోధన అందించిన అధ్యాపక బృందానిది కీలక పాత్ర అని ప్రిన్సిపాల్ లుకోదర్ పేర్కొన్నారు. కరస్పాండెంట్ ఎస్ వెంకయ్య డైరెక్టర్లు పి వీఎస్ ప్రసాద్ ఎం కొండయ్య ఎన్ సత్య ప్రసాద్ వి మల్లికార్జునరావు, ఆఫీస్ మేనేజర్ స్టాలిన్ లు ఈ ఫలితాల స్ఫూర్తి ని భవిష్యత్ లో కూడా కొనసాగించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్



నెల్లూరు: నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. నెల్లూరు వీపీఆర్ కన్వెన్షన్ లో జరిగిన వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులు ప్రజయ్ సేనారెడ్డి, డాక్టర్ జాహ్నవిలను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# కంటెంట్ నచ్చితే ఏ క్యారెక్టరైనా చేస్తా : డా. రాజశేఖర్.

యాంగ్రీ హీరో డా.రాజశేఖర్‌ను ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ సత్కరించింది. డా.రాజశేఖర్ కమ్ బ్యాక్ మూవీ “బైకర్” సినిమాలో ఆయన నటించిన పాత్రకు మంచి గుర్తింపు రావడంతో ఆయనకు క్రిటిక్స్ అసోసియేషన్ గౌరవఅధ్యక్షులు ప్రభు, అధ్యక్షులు జె.వి. బత్తుల ప్రసాద్‌రావు, సెక్రటరీ సురేష్‌కొండేటి తదితరులు బొకేను అందజేశారు. అనంతరం క్రిటిక్స్ ట్రెజరర్ భరద్వాజ సన్మాన పత్రాన్ని ఆయనకు చదివి వినిపించి, ఆయనకు అందజేయడం జరిగింది. సీనియర్ జర్నలిస్ట్, క్రిటిక్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ప్రభు మాట్లాడుతూ... రాజశేఖర్ నటన గురించి మనం ప్రత్యేకించి మాట్లాడక్కర్లేదు. అంకుశం ఆగ్రహం వంటి చిత్రాల్లో ఆయనది గ్రేట్ పెర్ఫార్మెన్స్. మనతో ఆయన అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మన వెంకటేశ్వరావుగారు ఎప్పుడూ మాట్లడని వారు ఆమన కూడా మాట్లాడారు అంటేనే చెప్పవచ్చు ఆయన మీడియాతో ఎంత చక్కగా ఉంటారో. సెకండ్ ఇన్నింగ్స్ లో ఆయన స్పిరిట్‌గాని ఆయన ఉత్సాహం మరింత రెట్టింపుగా ఉండాలి. ఫిలిం క్రిటిక్స్ చేస్తున్నారంటే దానికి ఒక గొప్పతనం ఏర్పడుతుంది. అప్పట్లో అక్కినేని నాగేశ్వరరావుగారు ఒకానొక సమయంలో ఫిలిం క్రిటిక్స్ చేసిన సన్మానం అనేది ఒక గొప్ప గౌరవంగా భావిస్తున్నాను అన్నారు. రాజశేఖర్‌గారి సహాయ సహకారాలు ఎప్పటికీ మన అందరికీ ఉంటాయి” అని అన్నారు. జీవితరాజశేఖర్ మాట్లాడుతూ... “మనమందరం ఒక ఫ్యామిలీలాంటి వాళ్ళం. మీడియాతో మాకు ఎప్పుడూ బావుంటది. మమ్మల్ని మీరు ఎప్పుడూ




కించపరచలేదు. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా ఎక్కువయిపోయి వాటిల్లో వచ్చే కొన్ని వార్తల వల్ల అసలు మీడియా ఏంటి జర్నలిజం ఏంటి అని కొంత కన్‌ఫ్యూజన్‌కి గురయ్యాను. రాజశేఖర్‌గారికి ఎన్నో అవకాశాలు వచ్చినా తను ఇన్‌స్పైర్ అయ్యే పాత్రలు రాక చేయడం లేదు. అదే విషయాన్ని ఆయన “బైకర్” ప్రమోషన్స్ సమయంలో చెబితే. దానికి... “రాజశేఖర్‌గారు క్యారెక్టర్స్ అడుగుతున్నారు” అన్నారు. ఆఫర్స్ అనేకం వస్తున్నాయి. నచ్చిన పాత్రలు రావడంలేదు అన్నారు. ఈ రోజు మిమ్మల్ని అందరినీ ఇలా కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. మొత్తం ఫ్యామిలీని కలిసినట్లు అనిపించింది” అని అన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ బాలరెడ్డి మాట్లాడుతూ... డా.రాజశేఖర్ చాలా విలక్షణమైన కథానాయకుడు. ఆయన నటించిన అంకుశం, తలంబ్రాలు చాలా అద్భుతమైన సినిమాలు. ఆయన సినిమాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో సంచలనాలు సృష్టించాయి. క్రిటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన మీట్ ది ప్రెస్ కి వచ్చిన మొట్ట మొదటి హీరో డా. రాజశేఖర్ అని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ మోహన్ గోటేటి మాట్లాడుతూ.. ఎన్ని హిట్లు వచ్చినా సరే ఆయన ఎప్పటిలానే ఉంటారు. కాస్త కూడా గర్వం ఉండదు. ఎప్పుడూ అందరితో కలిసి ఎంతో సరదాగా ఒక ఫ్యామిలీలాగా ఉంటారు. అంకుశం లాంటి సినిమా ఆయన కెరియర్‌లో ఎంత పెద్ద హిట్ ఇచ్చినప్పటికీ ఆయన బిహేవియర్‌లో కొంచం కూడా తేడా లేదు. అప్పట్లో రాఘవేంద్రరావు అల్లరి ప్రియుడు అని రాజశేఖర్‌ని తీసుకువాచ్చారేంటి.... ఈయన యాక్షన్ హీరో కదా అంటే మీరు అలాగే రాసుకోండి. యాక్షన్ హీరోని అల్లరి ప్రియుడులా రాఘవేంద్రరావు ఎలా చూపిస్తాడు అని మీరు రాసుకోండి అన్నారు. అలా ఏ పాత్రనైనా ఆయన చాలా అద్భుతంగా చేయగలరు. కల్లాకపటం లేని మనిషి. ఎక్కడ ఏమి మాట్లాడాలో కూడా తెలియని మనిషి. జీవితగారు ఉండబట్టి అన్నీ కవర్ చేసుకుంటూ వస్తున్నారు. బైకర్ చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. ఇక ముందు కూడా మరిన్ని సినిమాలు చేసి మంచి పేరు తెచ్చుకోవాలి” అన్నారు. అల్లరిప్రియుడు చిత్రానికి నేను పీఆర్‌ఓగా చేశాను” అన్నారు.

# ఊటుకూరు నాగార్జున్ కి అనిల్ కుమార్ యాదవ్ పరామర్శ

మాజీ ముఖ్యమంత్రి వర్యులు మరియు వైఎస్సార్ సీపీ అధినేత శ్రీ వైయస్ జగన్మోహనరెడ్డి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటన సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న 13 వ డివిజన్ కార్పొరేటర్ మరియు నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సీపీ యువజన విభాగం అధ్యక్షులు లిశ్రీ ఊటుకూరు నాగార్జున్ కి ప్రమాదవశాత్తు కాలికి గాయం అవ్వగా నెల్లూరు అపోలో ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకొంటున్నారు. ఈ సందర్భంగా నాగార్జున్ ని వారి నివాసంలో పరామర్శించిన మాజీ మంత్రివర్యులు మరియు వైఎస్సార్ సీపీ పీ ఏ సి సభ్యులు పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ .



Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.